
# బడి




అది స్కూలు, వాళ్ళు స్కూలు విద్యార్థులు. గంటకొట్టి రెండు నిమిషాలైంది. క్లాసుల్లోంచి బిలబిలమంటూ పిల్లలు గ్రౌండంతా పరుచుకున్నారు. వాళ్ళు వెదజల్లిన మల్లెమొగ్గల్లా వున్నారు. ఇటూ అటూ పరుగులుదీస్తున్నారు. అది వారి విద్యావిషయక తొలి విజ్ఞాన యాత్రా అన్నట్లు సంరంభంగా వుంది. కొందరు పిల్లలు ఆ పురాతన కట్టడాల్ని ఆసక్తిగా చూస్తున్నారు. ఈ వర్షాకాలం నిభాయిస్తాయా అన్న భావమో ఏమో, ఎటుచూసేవాళ్ళు అటు చూస్తున్నారు. అంత పెద్ద ఆవరణలో ఉత్సాహంగా అటూ ఇటూ పరిగెడుతున్నారు.

అక్కడక్కడ మట్టిదిబ్బలు, పాడుబడిన స్థలంలో పెరుగుతున్న పచ్చ గడ్డి, పాతబడి విరిగిన పైకప్పులు, సగం కూలిన గోడలు, ఎండిపోయిన వేపచెట్టు. ఆ స్కూలు శిథిలావస్థలో బిక్కుబిక్కుమంటోంది. ఎవరో గోడలు పాకుతున్నారు. చెడ్డి లాక్కుని కూర్చున్న ఓ చెల్లాయి చటుక్కున లేచి నిలబడిపోయింది. అవమాన భారంతో అటూ యిటూ చూస్తోంది.

ఆ ఆవరణ పక్కనే వేరుశనక్కాయలు చాయ్ దుకాణం వరసన పేర్చివున్నాయి. చాయ్ ఆర్డరిచ్చి గుంజకానుకుని నిలబడ్డారు సీనియర్ మేష్టారు శంకరయ్య సారు. అలసటగా కర్చీఫ్‌తో మొహం తుడుచుకున్నారు. చేతికున్న చాక్‌పీస్ పొడి దస్తీ కంటుకుంది. అది పౌడర్‌లా చెంపకి అద్దుకుని తెల్లగా మెరుస్తోంది.

అల్లంత దూరంనించి పిల్లవాడొకడు పరిగెత్తుకొస్తున్నాడు. వాడి పేరు పోచయ్య. శంకరయ్య సారు వాళ్ళ క్లాసు టీచరు. వాడు వాళ్ళ క్లాసు మానిటరు.

వాడు తనకోసమే వస్తున్నాడని శంకరయ్యసారుకి తెలుస్తూనే వుంది.

"అబ్బ ! భలే పిల్లలు దొరికారు, ఒక్కక్షణం వదలరే"

పుత్రవాత్సల్యంతో విసుక్కున్నారు శంకరయ్య సారు.

లూజు ప్యాంటూ, లూజు షర్టుతో సన్నగా పీలగా వుంటారు శంకరయ్య సారు.

"హెచ్చెం సారు మిమ్ముల రమ్మంటున్రు సార్"

పోచయ్య అలసటతో రొప్పుతున్నాడు. అలా రొప్పుతూనే అదే విషయం రెండుసార్లు అప్పగించినట్లుగా వల్లించాడు వాడు.

శంకరయ్య సారు ఎందుకో విసుక్కున్నారు. 'ప్చ్ ఈ హెచ్.యమ్. వీరయ్యగారిది అదో గోల. అయిందానికి కానిదానికి పిలిపించడమే. ఏదో మేనేజ్ చేసుకోవచ్చుగదా. ప్రతిదానికి స్టాఫ్ మీటింగులూ, పేరెంటు కమిటీ మీటింగులూ, చర్చలూ, సంతకాలు, తీర్మానాలూ, ఫైళ్ళూ. వీటిని మెయిన్ టైన్ చేయడంలో మాత్రం దిట్ట. వీరి మినిట్స్ బుక్ చూస్తేనా! ఇప్పటికే ఈ బడీ, పిల్లలూ అన్ని హంగుల్తో సర్వాంగ శోభితంగా అలరారుతున్నట్టే కన్పిస్తుంది. కాని ఎక్కడవేసిన గొంగడి అక్కడే. అవసరమైనచోటే వీరి నోరు మూతపడి మాట పెగలదు. ఒక్కపనీ స్వంతంగా చేయడం చేతగాదు. చచ్చేవాడు తానొక్కడు చావడే. ప్రతి దానికి ఎవర్నో ఒకర్ని పక్కన వేసుకుని చావాలని చూస్తాడు. ఛ, ఛ, భలే హెడ్మాష్టరు దొరికాడు తమ ఖర్మానికి!'

అలా విసుక్కుంటూనే టీ సిప్ చేస్తున్నారు శంకరయ్య సారు. పిల్లవాడు సారుకేసి ఎంతో వింతగా ఆసక్తిగా చూస్తున్నాడు. అదేదో వింతపక్షి అంతకు క్షణం క్రితం చూసింది అచ్చం యిలాగే తాగేదన్నట్టు సారుకేసి ఆ టీ తాగడం కేసి అదే పనిగా చూస్తున్నాడు. అది గమనించిన సారుకి మరింత చిర్రెత్తుకొచ్చినట్టుంది.

"వస్తున్నా పదరా!"

వాడు మేష్టారికన్నా తెలివైన పిల్లవాడిలా ఉన్నాడు. అక్కణ్నించి కదలలేదు. "లేద్సార్, ఉత్తగపోతె నన్ను మల్లా యిట్లనే వురికిస్తడు సార్."

"ఆహా! గురువుకు తగ్గ శిష్యులు దొరికారురా!" అని తనలో తానే నవ్వుకుంటూ విసుక్కున్నారు శంకరయ్య. 'పద' అంటూ దారితీశారు.

సారుని చూసి కొందరు పిల్లలు పక్కకు తప్పుకున్నారు. కొందరు గౌరవంతో చూస్తున్నారు. "సారు పక్కన నడుస్తున్నా ! చూడండి మన గొప్ప" అన్నట్టు ఛాతీ ఉబ్బించి ఉత్సాహంగా అడుగులు వేస్తున్నాడు పోచయ్య.

గ్రౌండ్ నిండా పిల్లలే. నవ్వులు, కేరింతలు, పరుగులు బాల్యాన్నంతా ఒక్కచోట కుప్పబోసినట్టుగా వుంది గ్రౌండు. "ఇంతమంది భావిభారత పౌరులు తన శిష్యులు"

అని హృదయం ఉప్పొంగిపోయింది. శంకరయ్య సారులో అనిర్వచనీయ ఆనందం తొణికిసలాడింది. హుందాగా హెడ్‌మాస్టర్ గదికేసి నడిచారు.

హెడ్‌మాస్టరు వీరయ్యసారు మళ్ళీ స్టాఫ్ మీటింగు వేసినట్టున్నారు. శంకరయ్య సారు రాకకోసమే అందరు ఎదురుచూస్తున్నారు. ఆ మాటే అన్నారు వీరయ్యసారు. శంకరయ్యసారు పొంగిపోయారు. "అవును హెచ్చెం తర్వాత సీనియర్ తానేగా! ఆయన లీవుమీద వెళ్ళినప్పుడల్లా తానేగా ఇన్‌ఛార్జి. మరి ఎదురు చూడమంటే చూడరూ!" సగర్వంగా ఫీలయి హుందాగా తల ఆడించాడు శంకరయ్య సారు.

వీరయ్యసారు తన సహజ ధోరణిలో హెచ్చెంగా తన యింట్రడక్షన్ ప్రారంభించారు.

"మన జిల్లా ప్రజా పరిషత్ చైర్మన్‌గారు సర్‌ప్రైజ్ యిన్‌స్పెక్షన్‌కి అదే ఆకస్మిక తనిఖీకి, ఇంకో మూడు రోజుల్లో రాబోతున్నారని మీ అందరికి తెల్సుగద."

"వారికీ మీకూ ఏనాటిదో పరిచయం వుండడం మా ఖర్మానికొచ్చింది. ఇప్పటికి మూడు స్టాప్ మీటింగులు పెట్టి చెప్పింది యిదే విషయంకదా! మళ్ళీ యిదేనా! ఆహా! 'ఆకస్మిక తనిఖీ'కి అన్ని సరిగ్గా వున్నాయో లేవో, అందరు సరిగ్గా వున్నారో లేదోనని అయిదుసార్లు స్టాప్ మీటింగుల్లో చర్చ, వీరు చైర్మన్ ఎలక్షన్స్‌కి సొంత డబ్బుల్తో ప్రచారం చేశానని సొంత డబ్బా వేసికొంటారు. నేన్నమ్మను, పైసా తక్కువైతే పిల్లలనించి రాబట్టాలనే వీరికి అంత ధైర్యమే! అంతాహంబక్. తన పరపతి పెంచుకుందామనే ప్లాన్‌లో ఈ ప్రచారం ఒకటి అంతే. అది నిరూపించుకోడానికి చైర్మన్‌గారి క్యాంపుక్లర్కునీ, చైర్మన్‌నీ కలిసి ఏదో ఏర్పాటుచేసికొని వచ్చారు. అయినా అంతా వీరి భ్రమ, ఎన్ని బొప్పెలు కట్టినా గ్రహించరే! ఫ్చ ఏందో తాపత్రయం. లోకంలో తానొక్కడే హెడ్మాస్టరైనట్టు!" పైకి అనలేక మనసులోనే విసుక్కుంటున్నారు, శంకరయ్య సారు.

"పై కప్పులు ఎగిరిపోయినై, ఏమన్న బడ్జటు సాంక్షన్ చేసిన్రా ?" ఇటీవలే ఉద్యోగం దొరికిన చిన్నయ్య సారు ఉత్సాహంగా అడిగాడు.

'రామాయణంలో పిడకల వేటలా మధ్యలో యిదేం చర్చ' అన్నట్టు ముఖం చిట్లించి చిన్నయ్య కేసి చూశారు వీరయ్య సారు. అది గమనించి మళ్ళీ అన్నాడు చిన్నయ్యసారు.

"అదే, బడ్జట్ సాంక్షన్ అయితే పనిలో పని శంకుస్థాపన చేయించొచ్చని."

"ఎక్కడ ? పైకప్పు ఎక్కి పునాదిరాయి పాతుమన్నవా ?"

"అవును శంకుస్థాపన రాయిపాతే అవకాశం లేకనే రిపేర్లకు బడ్జట్ మంజూరు చేయడం లేనట్టుంది."

గది అంతా నవ్వులతో మారుమోగింది. బెల్లుకొట్టారు వీరయ్యసారు. తామేమీ పిల్లలం కాదన్నట్టు సీరియస్‌గా అందరు హెచ్చెం కేసి చూశారు. అదే క్షణంలో అటెండర్ హాజరయ్యాడు.

"అందరికీ హాఫ్ హాఫ్ చాయ్ తీస్కరా"

"అట్పో-రెండర్దాల బెల్లు కొట్టగల చతురిడివేలే" మళ్ళీ గొణుక్కున్నారు శంకరయ్య సారు.

"అయితే చేర్మన్ సాబు అన్ని క్లాసులు తిరగొచ్చు, కొన్ని ప్రశ్నలు కూడా అడుగుతారేమో, బాగాచెప్పిన్రనుకుంట" అందరికేసి చూశారు వీరయ్యసారు.

"పిల్లలకేంది సార్, పిడుగులు. ఏది అడిగితే అది టకాటక్ చెప్తరు." ఉత్సాహంగా అన్నాడు చిన్నయ్య సారు. టీచరమ్మ గారు చిన్న పిల్లాడి మనస్తత్వంలా వుందన్నట్టు నవ్వుతూ చిన్నయ్య కేసి చూసి నవ్వింది.

వాతావరణం చల్లగా వుంది. ఆకాశం నిండా మేఘాలు పరుచుకుంటున్నాయి. సూర్యుడు కన్పించడం లేదు. వెలుగు వెన్నెల్లా తెల్లగా వుంది. ఆటల్లో పడ్డ పిల్లల అరుపుల స్థాయి పెరిగింది. అది ఆ గదిలోకి చొరబడుతోంది. చర్చ సాగుతోంది.

"అయితే యింతకు ముందటి తీర్గ అదేం లేదు గద"

"ఏ! వాళ్ళెక్కడున్నరు సార్ ? ఉన్న పోరగాండ్లకు టీ.సి. లిచ్చి పంపిస్తిరి గద".

"పంపిచ్చినమనుకో ! కాని అక్కడక్కడ పరిగెతీర్గ ఎవడన్న లేడుగదా! ఒక్కడున్నా కుండెడు పాయసంలో ఒక్క విషం బొట్టు తీర్గ" పాయసమంటే వీరయ్యగారికి చాలా యిష్టం. అన్నిటికి అదే పోలికగా ఉపయోగిస్తాడు.

"ఛ ఛ ఎవరున్నరు సార్ ? అంతా మీ చేతికింది స్టూడెంట్సేనాయె" అలా చర్చ సాగి టీ తాగడంతో ముగిసింది.

○ ○ ○ ○ ○

"అన్నా ! అన్నా ! ఎల్లుండి మా స్కూలుకు జడ్.పి.పి. చైర్మెన్ వస్తున్నడే" ఉత్సాహంగా చెప్పాడు పోచయ్య. "గిప్పుడే ఏదన్న చెయ్యాల్నే! ఏదన్న మంచి ఉపాయం జెప్పు."

"ఏముంది ? మీ బడికి ఏమేంగావాల్నో డిమాండ్లు రాసియ్యండ్రి. స్కూల్ బాయ్‌కాట్ చేయించు."

"నీయవ్వ ఎవలు సంతకం బెడుతరే? ఈ ఏడే నల్గురికి టిసీలిచ్చి పంపిన్రు, గిసొంటి ముచ్చట్లు నేనేదన్న మాట్లాడ్తనేమోనని యిగ నాతోటి మాట్లాడుడే బందు జేస్తున్నరు. గంత బయపడుతున్నరు. ఎవలు బాయికాట్ చేస్తరు ?"


"కనీసం డిమాండ్లు రాసియ్యొచ్చుగద"

"సంతకాలు ఎవలు పెడుతరు ? మే మే అయిదారుగురం పెట్టుడైతది. అది జూసి మాగ్గూడ టి.సి. లిచ్చి పంపుతరేమో ?"

"మరి ఏం జేద్దామనుకుంటున్నరు ?"

"ఎట్ల జెయ్యాల్నో నువ్వే ఉపాయం జెప్పు. కాని ఉపాయం ఎట్లుండాల్నంటే - మల్ల మా స్టూడెంట్సుంత మంచిపని జేసిన్నని మెచ్చుకోవాలె. చైర్మన్‌కు అనుమానం

రావద్దు. ఎంత చిన్నదైనా సరే మనం తలపెట్టిన పని మాత్రం గావాలె. స్టూడెంట్సు మళ్ల మన దగ్గరికి రావాలె. మాటయినాలె."



అలా ఆ అన్నాదమ్ములు కొంతసేపు చర్చించుకున్నారు. ఓ పది నిముషాలకి అన్న ఓ బ్రహ్మాండమైన అయిడియా తట్టి ఎగిరి గంతేశాడు. తమ్ముడి చెవిలో వూదాడు. తమ్ముడు ఉత్సాహం పట్టలేక మిగతా స్నేహితులకి చెప్పడానికి తుర్రుమని పరిగెత్తాడు.

○ ○ ○ ○ ○

జె.పి. ఛైర్మన్‌గారి సందర్శన ఆరోజే. స్కూలు నిశ్శబ్దంగా వుంది. ఎవరో పైవాళ్ళు చచ్చిన కబురు అప్పుడే అందినట్టు భారంగా ఉంది స్కూలు, ఛైర్మన్ రావడం తల్లుల పీకమీదికొచ్చి నట్టుంది. పిల్లలు వేసుకున్న డ్రెస్సులు తళతళ మెరుస్తున్నాయి. క్రాఫ్ నూనెపెట్టి నున్నగా దువ్వి అద్దినట్టున్నారు. పుస్తకాలకు, నోటు బుక్కులకు కొత్త అట్టలు వేసినట్టున్నారు. స్కూలంతా ఉతికేసి కొయ్యకి తగిలించిన డ్రెస్సులా కడక్ యిస్త్రీమీద వుంది.

కుడి ఎడమలుగా అసిస్టెంటూ, హెచ్చెంలు రాగా అటెండర్లు వెనక అనుసరించగా రవితేజములలరగ హుందాగా క్లాస్‌రూంలో దూరారు ఛైర్మన్‌గారు. పిల్లలు లేచి వినయంగా నమస్కరించారు. ఆ వందన సమర్పణతో ఛైర్మన్ గారి ముఖం పువ్వులా వికసించింది. అందర్నీ కూర్చోమన్నారు. పిల్లలు ఒద్దికగా కూర్చున్నారు. అవీ యివీ అడిగారు ఛైర్మన్ గారు, అనుకున్నట్టుగానే టకాటకా హుషారుగా జవాబులిచ్చారు పిల్లలు. మేష్టారు హెచ్చెంగార్ల ఛాతీ సంతోషంతో ఉబ్బిపోయింది. ఛైర్మన్‌గారు పిల్లల్ని అభినందిస్తున్నట్టు చూసి మరో క్లాసు రూంలో దూరారు. అన్ని సజావుగానే సాగాయి. ఛైర్మన్‌గారు పిల్లల్నించి సెలవు కోరుతున్నంతలో 'సార్' అన్న పిలుపు విన్పించింది. అందరు అటుకేసి చూశారు. ఏదో అడగాలన్నట్టుగా లేచి చేతులు కట్టుకుని వినయం వుట్టి పడేలా నిలబడ్డాడు పోచయ్య.

"ఏమిటి బాబూ ?" ఛైర్మన్‌గారు వాణ్ని ప్రోత్సహిస్తూనే హెచ్చెంకేసి చూశారు.

"మనం స్త్రీలను గౌరవించాల్నా లేదా సార్ ?"

ఉపన్యాసం యివ్వడానికి మాంచి ఛాన్సు దొరికింది - వదులుకుంటారా ఛైర్మన్‌గారు. ఉత్సాహంగా అందుకున్నారు.

"అదేంటి బాబూ అట్లంటవు? మనం మన దేశంల స్త్రీలకు యిస్తున్నంత గౌరవం ఏ దేశంల యిస్తున్నారు ? స్త్రీలందర్ని కన్న తల్లులుగ, అక్కలుగా, చెల్లెళ్ళుగా గౌరవిస్తున్న దేశం మనది. చదువుల తల్లి సరస్వతీదేవిని నిత్యం పూజిస్తున్నామా ! అంతేకాదు ఝూన్సీ లక్ష్మీబాయి, రాణీ రుద్రమ దేవి వంటి వీర మాతలగన్న పుణ్యభూమి యిది. బాల చంద్రుణ్ణి, భగత్సింగ్‌ను తీర్చిదిద్దిన వీర వనితల గన్న భరతగడ్డయిది. అంతదాకా ఎందుకు ? నిన్నటిదాకా మన ప్రధాని ఎవరు ? మనం స్త్రీలను గౌరవించక పోవటమేంది? ఎవరన్నరు ? మీలో ఎవరన్న మీ చెల్లెండ్లపట్ల, తోటి విద్యార్థుల పట్ల అగౌరవంగా ప్రవర్తించినారా ? అవమానించినారా ? చెప్పు బాబూ చెప్పు! అలాంటి వాళ్ళని చూస్తూ వూరుకునేది లేదు. స్త్రీలని అవమానించడం అంటే తన కన్నతల్లిని, తన సొంత చెల్లిని అవమానించినట్టు, తనను తాను అవమాన పర్చుకున్నట్టు....." గంగా ప్రవాహంలా కామా ఫుల్‌స్టాపుల్లేకుండా సాగుతోంది. ఛైర్మన్‌గారి ఉపన్యాసం. శ్వాసకోసం అరక్షణం ఆగాడోలేదో పోచయ్య మళ్ళీ సందుచేసుకున్నాడు.

"మా స్కూల్లో ఎనుభై మంది చెల్లెండ్లున్నరు సార్" ఏదో పూర్తిచేయబోయిన పోచయ్య మాట పూర్తికానేలేదు. ఛైర్మన్ అంతా గ్రహించినట్టుగా అందుకున్నారు.

"వెరీగుడ్ స్త్రీలు విద్య నేర్వడం అంటే కుటుంబం అంతా విద్యనేర్చినట్టు సమాజానికే విద్య అబ్బినట్టు, నేటి పిల్లలే రేపటితల్లులు............"

మధ్యలోనే ధైర్యంచేసి నోరు తెరిచాడు పోచయ్య.

"మేం యింటర్వెల్ల గూడ యింటికి పోవుటానికి టైమ్ చాలదుసార్. చాలా మంది దూరం నించి, పొరుగూర్ల నుంచి వస్తరు సార్. పొద్దుటేల వచ్చిన మంటె అయిదారు గంటలు స్కూలుకెళ్ళి ఎటూ కదలం సార్."

క్లాసంతా నిశ్శబ్దంగా వుంది. వీరయ్య సార్‌కి వాడేం పుట్టిముంచుతాడోనని లబ్‌డబ్ లబ్‌డబ్ మని గుండె కొట్టుకుంటున్నది. వాడికేసి గుడ్లురిమి చూశాడు. పిల్లలు ఆశ్చర్యంగా ఆరాధనగా పోచయ్యకేసి చూస్తున్నారు. చిన్నయ్యసారు హెచ్చెం చాటున మెచ్చుకోలుగా చూశాడు పోచయ్య కేసి.

"వెరీగుడ్ చాలా మంచి క్రమశిక్షణ అట్లనే వుండాలె" మెచ్చుకున్నారు ఛైర్మన్‌గారు.

"కాని మా చెల్లెండ్లకు మాత్రం పోద్దామంటే కనీసం సాటుగూడలేదు సార్. అయిదారు గంటలు మాత్రం బిగపట్టుకోవాలె. సుట్టూ మంది, మా సంగతిసరేగని, మీరు కనీసం మా చెల్లెండ్లను గౌరవించాలని వుంది సార్ మాకు."

అడిగినంత స్పీడుగా కూర్చున్నాడు పోచయ్య. ఇంతదాకా అడిగిన ప్రశ్నలు ఎవర్ని ఉద్దేశించినవో అర్థమయ్యేసరికి వీరయ్యసారు ఛాతీ బరస్టయిన టైర్ అయిపోయింది. తల దిమ్మెక్కిపోయింది. వెధవ. ఛైర్మన్‌గార్ని వారి నోటే ఎన్ని తిట్లు

తిట్టించాడు. ఛ ఛ పున్న పరువంతాబోయింది. ఇదంతా తన ప్లానే అనుకోడు గదా ఛైర్మన్‌గారు. కళ్ళతోనే నమిలి తినేసేట్టు చూశాడు వీరయ్యసారు. వాడు ముఖం కన్పించకుండా ముందు కూర్చున్న వాళ్ళ వీపుని చాటుచేసికొన్నాడు.

ఛైర్మన్‌గారి గుండె గతుక్కుమంది. కాని అంతలోనే తేరుకున్నారు. పిల్లలు వారికేసే అసక్తిగా చూస్తున్నారు.

"అదేంది బాబూ ! ఇది స్త్రీలకెంత అవమానం ? అన్ని సౌకర్యాలూ ఉన్నాయన్నారే హెచ్చెంగారు" అంటూ హెచ్చెంగారి కేసి సాభిప్రాయంగా చూశారు

"మూడు రోజుల్లో మూత్రశాల కట్టించి బిల్లు క్లెయిం చెయ్యండి"

క్లాసురూం చప్పట్లతో మారుమోగింది. వాడిపోయిన ఛైర్మన్‌గారి నవ్వుల పువ్వు మళ్ళీ వికసించింది.

"సమస్యలేమైనా వుంటే యిలా ధైర్యంగా అడగాలె" అంటూ సెలవు తీసుకున్నారు ఛైర్మన్‌గారు. మరి క్లాసు రూముల్లోకి వెళ్ళలేదు.

○ ○ ○ ○ ○

వర్షంపడి వెలిసింది. స్కూలు గ్రౌండంతా పచ్చి పచ్చిగా వుంది. అంతా బురద బురదగా వుంది. అందరు తొక్కడంతో మరింతగా వానాకాలం బెల్లంలా గ్రవుండు బంకలు సాగుతోంది. సన్నగా తుంపర రాలుతోంది. పిల్లలు పరిగెత్తి జారి పడిపోతున్నారు. ఎవరో ఏడుస్తున్నారు.

శంకరయ్య సారు టీ కొట్టు వద్ద భూమిలోకి పాతబడ్డ ఒంటి చెక్క బెంచీ మీద కూలబడ్డారు. ఉదయం నించి ఒంట్లో నలతగా వుంది. టిఫినేమీ చేయలేదు. డబల్ రొట్టె టీలో అద్దుకొని తింటున్నాడు. తనకు జ్వరం వచ్చేలావుంది. ఇంట్లో భార్యకి మూడు రోజులుగా జ్వరం. టాబ్లెట్లు వేసుకుంటే తగ్గినట్టేతగ్గి మళ్ళీ వస్తోంది. రాత్రి పిల్లల యూనిట్ టెస్టు కాపీలన్నీ దిద్దేసరికి బాగా అలిసిపోయారు. నిద్ర కూడా సరిగ్గా పట్టలేదు. ఈ రోజు స్నానం చేయడానికి ఓపికలేకపోయింది. ఒళ్ళంతా చీదరగా వుంది. ఎవరి మీదో తెలియని కోపంగా వుంది.

"సార్ ! హెచ్చెం సార్ మీ కోసం చూస్తున్నరు సార్" అంటూ ఉత్సాహంగా పరిగెత్తుకొచ్చాడు పోచయ్య. మొన్న అది సాధించినప్పటి నుంచీ పోచయ్యకు అన్నీ జయించినంత ఉత్సాహంగా వుంది. దాంతో వాడికి కాలు నిలువడంలేదు.

అదేదీ గమనించలేదు శంకరయ్య సారు. మళ్ళీ స్టాఫ్ మీటింగేమో! ఖర్మ, ఖర్మ అని కోపంగా నొసలు కొట్టుకున్నారు. చీదరించుకున్నారు. అయినా విధిలేక హెచ్చెం గదికేసి నడిచారు.

ప్రారంభోపన్యాసం కానిచ్చి అసలు విషయానికొచ్చారు వీరయ్యసారు.

"వాడు, మీ క్లాసువాడే. వాణ్ని టి.సి. యిచ్చి పంపేయాలి."

"ఎందుకూ ?"

"ఎందుకేంది ? అంత పెద్దవాణ్ని పట్టుకొని తన నోట తననే అంతలేసి మాటలు తిట్టిస్తడా ? అసలు సమస్య అదిగాదు. ఎంత భయం లేకపోయివుంటే యిట్ల జెయ్యాలె ? ఈ క్రమశిక్షణా రాహిత్యాన్ని సహిస్తే ఈ స్కూలెట్లా నడుస్తుంది ? మీరే చెప్పండి మరి !"

ముందే శంకరయ్య సారుకి విసుగ్గా వుంది పై పెచ్చు వాడంటే తనకు ఎంతో ప్రేమ. ఒక్కసారిగా అసహనంతో గొంతు స్థాయి పెరిగిపోయింది. అయినా తమాయించుకొని అన్నారు.

"ఏం క్రమశిక్షణా రాహిత్యం సార్ ? వాడు జెయ్యబట్టెగద మూడు రోజులల్ల తడకల తోటైనా ఓ మూత్రశాలంటూ వచ్చింది. ఏమంటారు మేడంగారూ ?" టీచరమ్మ కేసి చూశారు శంకరయ్యసారు.

"అబ్బ ఎన్నిసార్లు చెప్పానండి. మూత్రశాల, మూత్రశాల అని పిల్లలు గోల పెడ్తున్నారని! వాడు జెయ్యవట్టే గద యిప్పటికిది నెరవేరింది. ఎనిమిది వేలు పర్మనెంటు మూత్రశాలకి సాంక్షన్ చేసింది."

తనగోడు, పిల్లల గోడూ కలుపుకునే చెప్పినట్టుంది మేడంగారు.

"అదిగాదండీ. వాడు దీంతోటి యిగ పట్టపగ్గాల్లేకుండైపోయిండు. స్కూలుకు సున్నం వేయించాలని, పై కప్పులు వేయించాలని, ఆటవస్తువులు తెప్పించాలని, సంతకాల సేకరణ ఉద్యమం, అదే మెమోరాండం రాసి సంతకాలు తీసుకుంటున్నాడండీ. రేపు ఎవరి కొస్తుంది మాట. మొన్ననే పరువు బోకుండా చూసుకునే సరికి చచ్చినంత పనైంది."

"అంత గాభరా పడుతున్నారు మిమ్ముల్ని ట్రాన్స్‌ఫర్ చెయ్యాలనిగూడ అందులో రాసిన్రా ఏంది ?" సూటిగా అడిగారు శంకరయ్యసారు.

"రాస్తే మాత్రం ? గీ పోరగన్ల తోటి ఏమైతది ?"

"మరెందుకు అంత భయం ? ఎందుకు టీ.సీ. యిచ్చి పంపుతానంటారు. ఇప్పటికి నలుగురికిచ్చిన్రు. మీకు మీరే గొప్ప హెడ్‌మాస్టర్‌ను అనుకుంటే చాలా? మీ వెనుక వూరోల్లంత మీ గురించి ఏమనుకుంటున్నారో తెల్సా ?"

అలా నిలదీస్తున్న శంకరయ్య సారుని మేడంగారూ, చిన్నయ్యసారూ మరింత ప్రోత్సహిస్తూ చూశారు. మిగతా స్టాఫ్ కూడా జరగాల్సిందే జరుగుతోందిలే అని తమాషాగా చూస్తున్నారు. వాళ్ళకీ ఉత్సాహంగానే వుంది. అందర్నీ కలియజూసి గంభీరమైపోయారు శంకరయ్య. కొంత కాలం యూనియన్ సెక్రటరీగా చేసిన గొంతుతో ఎక్స్‌ప్లెయిన్ చేస్తున్న వాడిలా అన్నారు. చిరాకు ఎక్కడ బోయిందో.

"పిల్లలు బడికి ఉపయోగపడే పని ఏదన్న చేస్తానంటే గట్ల కాదుర బాబూ గిట్ల

జెయ్యాలె అని పద్ధతి చెప్పాలె గని మీరిట్ల చేస్తే యిక బాగుపడ్డట్టే."

"ఏందండి ! చూడవోతె పోరగాన్లను ఎగదోస్తున్నది మీరే అనిపిస్తున్నది. ఇంతకు మీరా నేనా హెడ్‌మాస్టరు ?"

శంకరయ్యసారుకి కోసం నసాళానికెక్కింది.

"మీరసలు బీఈడి చేసిన్రా ? గిట్లనే పైరవీ జేసిపాసైన్రా ?"

అవమానంతో వీరయ్యసారు కించపడి పోయాడు. మొహంజేవురించింది. కోపంతో కాళ్ళూ చేతులు వణుకుతున్నాయి. ఏం మాట్లాడాలో తోచలేదు.

బయట వాతావరణం చలిచలిగా వుంది. వర్షం మళ్ళీ ప్రారంభమయ్యేట్టుగా వుంది. తుంపర చినుకులు జల్లుగా ఎదుగుతోంది. పిల్లలు బిలబిలమంటూ చెట్టుకిందికి క్లాసు రూముల్లోకి పరిగెత్తారు. కొందరు జల్లు కొట్టకుండా గోడ అంచున నిలబడి తడుస్తామా లేదా అని తమాషా చూస్తున్నారు.

గదిలో చర్చ వేడిగా సాగుతోంది. మరో సీనియర్ అసిస్టెంటు ఇద్దరి మధ్యా కలగజేసుకున్నాడు. వీరయ్యసారు వూరకే బుసకొడుతున్నారు.

"నన్ను అసలు బీయిడి చేసినవా అని అడుగుతవా ? ఈ మాట వాపసు తీసుకొంటెనే సరే లేకుంటే........."

మళ్లీ లేచారు శంకరయ్య సారు.

వీరయ్యసారుకి మధ్యలోనే అడ్డుతగిలాడు శంకరయ్య సారు. ఒంట్లో టెంపరేచర్ కూడా పెరుగుతున్నట్టుంది.

"అవునండీ. సున్నమేస్తే వాడు గోడల మీద రాస్తడు. ఛైర్మన్‌గార్ని అడుగుతడు. ఇంకో మెమోరాండం రాస్తడు. సంతకాలు తీసుకొంటడు. రేపు మినిష్టర్ను కలుస్తడు ఎల్లుండి వూరేగింపు తీస్తడు. మీదేం బోయింది. వాడు యియ్యాల మీ కండ్లకు చిన్న పోరడే గావచ్చు. కాని వాడే రేపటి పౌరుడండి, రేపటి పౌరుడు. తనదేశం ఎట్లుందో తెల్సుకుందామనుకునేటోన్ని నువ్వు వద్దేనేదేంది ? వద్దనటానికి నువ్వెవరు ? నేనెవరూ? మనకా హక్కెవడిచ్చిండు ?"

"ఆ ! ఆ !" వూహించని దాడికి ఆవాక్కయి పోయారు వీరయ్యసారు.

"వాణ్నిసరే. టీసి యిచ్చి తీసేస్తరు. మరి దీన్నేంజేస్తరు ? బడిని! ఓ పెంకలన్నా సరిగ్గున్నాయా ? ఓ చాక్‌పీస్‌లు సరిగ్గున్నాయా ? ఓ స్టాఫ్‌రూం సరిగ్గుందా ? ఏది చక్కగుందని అన్నీ మెరిసి పోతున్నట్టు మాట్లాడ్తున్నరు. స్కూలున్న చోట పిల్లలుంటరు. ఎన్నో సమస్యలుంటై. పిల్లలు అదీయిదీ కావాలని అల్లరి చేస్తరు. మీ యింట్లో మీ పిల్లలు మాత్రం అల్లరి జెయ్యరా ! అందరికీ యిట్లనే టీ.సీ.లిస్తే ఈ బడినేం జేద్దామంటరు? బడికి కూడా టీ.సి యిద్దామా ? మరి మన ఉద్యోగాలకి గూడానా ?"

"ఆ" అని తెరచుకున్న వీరయ్య సారు నోరు అలాగే వుండిపోయింది. అంతలో

టీ వచ్చింది. వాతావరణం కొంచెం రిలాక్సు అయింది. టీ సిప్‌చేస్తూ అందర్నీ ఓసారి కలయజూశారు వీరయ్యసారు. ప్రహ్లాదుని రక్షణ కోసం నాడు ఒక్కడే నరసింహావతారం ఎత్తాడు. చూడబోతే వాడికోసం వీళ్ళంతా ఆ అవతారం ఎత్తినట్టేవున్నారు. ఇక చేసేదిలేదని అర్థం అయిపోయింది. గుప్పిట తెరిచారు. అసలు విషయం చెప్పారు. రెండు చేతులెత్తారు. పై వాళ్ళ మాటలు విని యిలా అయిపోయారు గాని వీరయ్యసారు నిజమైన వ్యక్తిత్వం యిదే. హోదావల్ల వచ్చిన భేషజం నీళ్ళల్లో పడ్డ బెల్లంలా కరుగుతోంది.

"నేను దేశసేవకోసమో మరిదేని కోసమో ఈ వుద్యోగం చేస్తలేను. నా తల్లి దండ్రులను, భార్యాపిల్లలను సాదాలె నేను. యింట్లో పెండ్లిగాని చెల్లెలున్నది. మా అమ్మ మంచంల పడి వున్నది. మా నాన్నకు కాలుపడిపోయింది. నేను వీళ్ళందర్నీ వదిలి వుండలేను. వాల్లు యింకోవూరికిరారు. వచ్చినా అందరికి సరిపోయే ఇల్లు దీసుకుంటె సగం జీతం కిరాయికే పోతది. ఎట్ల బతుకాలె. వానికి టీ.సి యివ్వకపోతే ఛైర్మన్‌గారు నాకు టీ.సి యిస్తానన్నారు. ఆయన మీకు బడ్జెటు సాంక్షన్ చేసిందొకటే తెల్సు. నా గోడు ఎవలకు జెప్పుకోవాలె. మా అమ్మను ఏం జెయ్యమంటరు ? చెల్లెల్ని దాన్నేంజెయ్యమంటరు ?"

చిన్నయ్యసారు ఆశ్చర్యంతో నోరు తెరిచాడు.

"ఔనండి మండలాధికారి చేప్తే ఒకణ్ణి మండల ప్రజా పరిషత్ అధ్యక్షుడు చెప్తే ఒకణ్ణీ, డి.ఇ.వో చెప్తే ఒకణ్ణీ యిట్లా టీ.సీ లిస్తూ పోతేఎట్లా? వాళ్ళ స్వార్థంకోసం, మీ స్వార్థంకోసం పిల్లల భవిష్యత్తును నాశనం జేస్తారా? అట్లని మీ కుంటుంబాన్ని అనాథలుగా వదిలేసి మీ తల్లిని చంపుకొమ్మని ఏ నీచుడండీ అనేది? మీరు పిల్లల తలలో నాలుకలా కల్సివుంటే మీ కెవడండీ టీ.సి యిచ్చేది? పిల్లలు తలుచుకుంటే కొండమీది గోపయ్యయినా దిగిరావలసిందే. పిల్లల్తోటి మీరు మంచిగుంటె మీరు పోతానన్నా పోనియ్యరు."

"అవునండి." మేడంగారు భరతవాక్యం పలికారు.

'అంతేనంటారా' అన్నట్టు తనను తాను సరిదిద్దుకున్నవాడిలా వినయమూ, చిరునవ్వూ కలగలసినట్టుగా నవ్వారు వీరయ్య సారు. చాలాకాలం తర్వాత చప్పట్లతో ఆ స్కూల్ స్టాఫ్ మీటింగ్ ముగియడం ప్రారంభమైంది.

బయట వర్షం ప్రారంభమైంది. పిల్లలు ఒదిగొదిగి గోడలకు ఆని నిలబడు తున్నారు. స్టాఫ్ మీటింగ్ నుంచి శంకరయ్యసారు బయటకు రాగానే గోడచాటునించి బురద కాళ్ళతో సారు పక్కనే జేరాడు పోచయ్య వాడి కళ్ళల్లో నీళ్ళు వర్షించడానికి సిద్ధంగా వున్నాయి. ఆప్యాయంగా వాడి భుజంమీద చెయ్యేశారు శంకరయ్య సారు పోచయ్య కళ్ళలోంచి జలజలా వెచ్చగా కన్నీళ్ళు కారాయి.




"పిచ్చివాడా ? ఎందుకురా ఏడుస్తవు" నిన్ను వదులుకొంటాన్రా ?" నవ్వుతూనే అన్నారు శంకరయ్యసారు. కాని అది నవ్వులా లేదు. నీరసంగా వుంది. ఎందుకో ఆసారు కళ్ళల్లో నీళ్ళు తిరిగాయి. జ్వరంతో ఒళ్ళు ఆవిర్లు కక్కుతోంది. అడుగేయబోయి జారి తూలి బురదమట్టిలో పడిపోయారు. పిల్లలూ ఉపాధ్యాయులూ ఒక్కసారిగా గుమిగూడారు. శంకరయ్యసారుని లీవు పెట్టమన్నా పెట్టక పోవటానికి కారణం ఒక్క వీరయ్యసారుకే తెల్సు. వర్షంలో పశ్చాత్తాపంతో తడిసిపోయారు వీరయ్యసారు. స్టాఫ్‌రూంలోకి తీసికెళ్ళారు.

వర్షం నిలకడగా కురుస్తోంది. స్కూలుకు సెలవు ప్రకటిస్తూ బెల్లుకొట్టారు. కొందరు పిల్లలు వర్షంలోనే బయల్దేరారు. తమ గుడెసెకన్నా బడే ఒకమాదిరిగా వెచ్చగా వున్న పోచయ్య వంటి కుర్రాళ్ళు కురుస్తున్న గదుల్లోనే మూలకు ఒదిగిపోయారు.

**– ఉపాధ్యాయ మాస పత్రిక, సెప్టెంబరు 1987**

**– ఉపాధ్యాయ కథల సంపుటి 2004**